క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఆగస్టు 1న సర్టిఫికెట్ల పరిశీలన, 3న కౌన్సిలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 75690 62449, 9948582309కు ఫోన్ చేయాలని కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

గరుగుబిల్లి: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు ఆర్‌బీకే, సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలోని రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై సిబ్బందితో సమీక్షించారు. ఖరీఫ్‌నకు సంబంధించి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. పీఎం కిసాన్ ఈ–కేవైసీ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, కార్యదర్శి కోటేశ్వరరావు, తదితరులున్నారు.

21 నుంచి ఇంటింటి సర్వే

కురుపాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూత్‌లెవిల్ అధికారులు(బీఎల్ఓ)తో సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు అన్ని గ్రామాల్లో డోర్ టు డోర్ సర్వే చేపట్టాలన్నారు. తప్పుడు డోర్ నంబర్లపై దృష్టి సారించాలని, మైగ్రేషన్, డిలీషన్ అయితే ఫారం 7ను పూర్తిచేయాలని, కొత్త ఓటర్ల నమోదుకు ఫారం 6 నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ రమేష్ కుమార్, ఆర్ఐ కరుణాకరరావు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వారాల పండగ

గరుగుబిల్లి: మండలంలోని రావివలసలో దేశతల్లి, చింతల పోలమ్మ అమ్మవార్ల వారాల పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలను మేళతాళాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా ఖరీఫ్ పనులు ప్రారంభానికి ముందు అమ్మవారికి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు.

పరిశుభ్రత పాటిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం


ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలకొండ రూరల్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుందామని ఎం.సింగుపురం వైద్యాధికారి కడియం చిరంజీవి అన్నారు. పీహెచ్‌సీ పరిధి జంపరకోటలో మంగళవారం అవగాహనా ర్యాలీ చేపట్టారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య జాగ్రత్తలతో పాటు, దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. డాక్టర్ రవికుమార్, పంచాయతీ సెక్రటరీ ఎస్.భూలక్ష్మి, ఏఎన్ఎం టి.రామలక్ష్మి, ఆరోగ్య సహాయకులు ఎ.పెంటయ్య, ఎన్.ప్రసాద్ తదితరులున్నారు.

అధిక జనాభాతో అనర్థం

గుమ్మలక్ష్మీపురం: ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణను పాటిస్తూ జనాభా నియంత్రణలో భాగస్వామ్యులవ్వాలని తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.బుద్దేశ్వరరావు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని తాడికొండ గ్రామంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రపంచంలో జనాభా రోజురోజుకు పెరుగుతోందని, ప్రస్తుతం 142 కోట్ల జనాభాతో భారత్ మొదటి స్థానంలో ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో జనాభా పెరుగుదలను నియంత్రించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పద్మ, హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మి, సూపర్‌వైజర్లు శ్రీను, సింహాచలం, ఎర్రయమ్మ, ఆరోగ్య సహాయకులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: మానవ వనరులే దేశానికి బలమని గుర్తించాలని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్దననాయుడు అన్నారు. జాతీయ జనాభా దినోత్సవాన్ని పుష్కరించుకుని అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్, అధ్యాపకులు జనాభా విశిష్టత, పెరుగుదల వల్ల చోటుచేసుకునే పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కలుపు నివారణపై అవగాహన

భామిని: మండలం బొడ్డగూడలో మెట్టు పంటలపై వ్యవసాయాధికారి కె.సింహాచలం గిరిజన రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ప్రత్తి, ఇతర మెట్టు పంటలలో గొర్రులతో దుక్కి దున్నినట్లయితే కలుపు నివారణతో పాటు భూసారం పెరుగుతుందన్నారు. భామిని హార్టీకల్చర్ అధికారి ఎర్రన్నతో కలిసి గొర్రుతో కలుపు ఏవిధంగా తీయాలో రైతులకు వివరించారు. కలుపు నివారణకు క్రిమిసంహారక మందుల వినియోగం భూమికి, రైతుకు ప్రమాదకరమన్నారు.


కురుపాం: బస్టాండ్ కూడలిలో పవన్ ఫొటోలను చెప్పలతో కొట్టి నిరసన తెలియజేస్తున్న వలంటీర్లు


వీరఘట్టం: మండల కేంద్రంలో పవన్ చిత్రపటాలతో నిరసన తెలియజేస్తున్న వలంటీర్లు


భామిని: పవన్ చిత్రపటాలను కాళ్లతో తొక్కుతూ నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

వలంటీర్ల ఆగ్రహ జ్వాల


భామిని: పవన్ దిష్టిబొమ్మకు చెప్పలతో కొడుతున్న వలంటీర్లు


వీరఘట్టం: అంబేడ్కర్ జంక్షన్ వద్ద పవన్‌కు వ్యతిరేకంగా నినదిస్తున్న వలంటీర్లు

- అనుచిత వ్యాఖ్యలపై పవన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- పవన్ చిత్రపటాలను దగ్ధం చేసి నిరసన ప్రదర్శన

గ్రామ వలంటీర్లను కించపరుస్తూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏలూరు సభలో చేసిన వ్యాఖ్యలపై వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో మంగళవారం పవన్ చిత్రపటాలను, దిష్టిబొమ్మలను దగ్ధం చేసి నిరసనలు తెలియజేశారు. ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి పవన్ కల్యాణ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. నిష్పక్షపాతంగా సేవలందిస్తున్న వలంటీర్లను సంఘ విద్రోహులుగా అభివర్ణించటం సరికాదన్నారు. పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే అంచెలంచెలుగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

కన్న కూతురులా చూసుకుంటుంది



అయ్యా నా పేరు కరణం ఆదమ్మ. నా కుటుంబ సభ్యులు ప్రస్తుతం నాకు అందుబాటులో లేరు. నేను పలకొండ పట్టణ మండలం వడమ సమీపంలోని కల్యాణి కోనేటి గట్టుపై ఒంటరిగా ఉంటున్నాను. నాకు ఇల్లు కూడా లేదు. ప్రభుత్వం అందిస్తున్న పింఛను మొత్తమే ఆధారం. మా వలంటీరు వెంకటలక్ష్మి కన్న కూతురువలే సాకుతుంది. ప్రతీరోజు నా వద్దకు వచ్చి యోగక్షేమాలు తెలుసుకుని సహకరిస్తుంది. నాకు ఆరోగ్యం బాగాలేనప్పుడు సేవలు అందించింది. నా వంటి వృద్ధుల గడప వద్దకే వలంటీర్లు వచ్చి ప్రభుత్వ పథకాలు అందించి అండగా ఉంటున్నారు. వారిపై తప్పుడు మాటలు అనటం మంచిదికాదు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు పొందేందుకు గతంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా ఫలితం ఉండేదికాదు. జగనన్న పాలనలో ఏర్పాటుచేసిన వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు అర్హుల ఇంటి వద్దకే వచ్చి చేరుతున్నాయి. కోవిడ్ సమయంలో ప్రాణ భయంతో అంతా ఇళ్లకు పరిమితమైతే.. వలంటీర్లు గడపగడపకు వచ్చి సేవలు అందించారు. కరోనా భారిన పడిన వాళ్లకు ధైర్యం చెప్పి సరైన సమయానికి మందులు అందించారు. వారి ప్రాణాలు అడ్డు పెట్టి ఎందరో ప్రణాలు కాపాడారు. కష్ట సమయంలో వారు అందించిన సేవలు వెల కట్టలేనివి. వారిని దుర్భాషలాడటం సమంజసం కాదు.

– గుడివాడ భానుమతి, పింఛను లబ్ధిదారు, వీరఘట్టం

సేవలందిస్తున్న వారిపై దుర్భాషలు సరికాదు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ చాలా బాగుంది. మా ఇంటికి వచ్చి నేను ఏయే పథకాలు పొందేందుకు అర్హత ఉందో గుర్తించి ఆయా పథకాలకు వారే దగ్గరుండి దరఖాస్తు చేశారు. ప్రభుత్వం నుంచి మంజూరైన పథకాలను ఇంటికి వచ్చి అందించారు. వైఎస్సార్ చేయూత, విద్యాదీవన, రైతుభరోసా, వైఎస్సార్ ఆసరా, ఇంటి స్థలంతో పాటు ఇల్లు ఇలా సంక్షేమ పథకాల ద్వారా గత నాలుగేళ్లలో నాకు రూ.7లక్షల 20వేలు అందింది. సేవలందిస్తున్న వారిపై పవన్ కల్యాణ్ చేసిన వాఖ్యలు సరికాదు.

– బొట్ట లక్ష్మి, రాజ్యలక్ష్మీపురం, కొమరాడ మండలం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి


ఊసకొండలో సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కురుపాం: పార్టీలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని ఊసకొండ పంచాయతీ పరిధి సొబ్బ, పాలంగూడ, పొడ్డిన, పనసభద్ర, నడిమిగూడ, నాయుడుగూడ, అమలాపురం, భద్రాపురం గిరిజన గ్రామాల్లో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గిరిజనుల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే భవిష్యత్‌లో వైఎస్సార్‌సీపీ విజయానికి దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఊసకొండ సర్పంచ్ సులోచన, ఎంపీపీ శెట్టి పద్మావతి, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, జెడ్పీటీసీ గొర్లి సుజాత, ఎంపీటీసీ టి.వి.ఎస్.స్వామియాజులు, నీలకంఠాపురం సర్పంచ్ అడ్డాకుల మన్మథరావు, పార్టీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటరావు, పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు ఇంటికుప్పల రామకృష్ణ, టి.షేక్ ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనల వేలం

కొమరాడ: సార కేసుల్లో సీజ్ చేసిన ఐదు ద్విచక్ర వాహనాలను ఈ నెల 13న స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎస్సై జగదీస్‌నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలో శ్రీనివాసనగర్, సీఎల్ నాయుడునగర్, ఎన్‌కే రాజపురం, సీతంపేట రోడ్డులో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ ఎస్.శ్యామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధి లుంబూరు రహదారిలో ఉన్న జగనన్న కాలనీలో నూతన సబ్‌స్టేషన్ పనులు చేపడుతున్నందున టౌన్–1 ఫీడర్‌లో 11 కేవీ విద్యుత్ లైన్‌లకు సంబంధించి సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయం గమనించి సహకరించాలన్నారు.

'జగనన్న సురక్ష'తో సత్వర సేవలు

అర్హులకు ప్రభుత్వ పథకాలు, సేవలను సత్వరం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఈ కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. ఇప్పటికే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ముందుస్తు సర్వేలు చేసి ప్రజల అవసరాలను గుర్తించారు. ఆ మేరకు గ్రామ సచివాలయాల్లో లబ్ధిదారులకు అవసరమైన వివిధ రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తున్నారు. సీతంపేట మండలం దోనుబాయి, భామిని మండలం వడ్డంగిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పాల్గొని పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. పాలకొండ పట్టణంలోని గారమ్మ కాలనీ సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జియ్యమ్మవలస మండలం బీజేపురంలో నిర్వహించిన కార్యక్రమంలో పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్, వీరఘట్టం మండలం కత్తులకవిటి, చినగోర సచివాలయాల్లో నిర్వహించిన కార్యక్రమంలో డ్వామా పీడీ పి.కిరణ్‌కుమార్ పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ సాంకేతిక సమస్యల కారణంగా సంక్షేమ పథకాలు పొందని వారికి 'జగనన్న సురక్ష'లో అవసరమైన ధ్రువపత్రాలు అందించడంతో పాటు పథకాల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

సాక్షి నెట్‌వర్క్, పాలకొండ/కురుపాం


సీతంపేట: దోనుబాయిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి


పాలకొండ: గారమ్మకాలనీలో దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు


పాలకొండ రూరల్: నవగాంలో అర్జీదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


భామిని: వడ్డంగిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి


గుమ్మలక్ష్మీపురం: తాడికొండలో లబ్ధిదారుకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న మండల ప్రత్యేకాధికారి సత్యంనాయుడు


జియ్యమ్మవలస: బీజేపురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్


వీరఘట్టం: కత్తులకవిటిలో లబ్ధిదారునికి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న డ్వామా పీడీ కిరణ్‌కుమార్, జెట్పీటీసీ కన్నతల్లి

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే కళావతి


సీతంపేట: సంక్షేమ లబ్ధిపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సుపరిపాలన, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మర్రిపాడు గ్రామ సచివాలయం పరిధిలోని జజ్జువ, గూడగుడ్డి, మర్రిగూడ, పెదబగ్గ, సందిగూడ, తోటగూడ, మర్రిపాడు గ్రామాల్లో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లగా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందజేస్తున్నామన్నారు. అలాగే గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నామని, నిరుపేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు, గిరిజనులకు అటవీహక్కు సాగు పత్రాలు పంపిణీ చేశామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో బైక్ అంబులెన్స్ సేవలు, సీతంపేటలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం, ఏరియా ఆస్పత్రిలో అదనపు భవనాల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాలకొండ ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహనరావు, పార్టీ నాయకులు ఎస్.రాము, వి.చలపతి, మహేష్ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓలు

వీరఘట్టం: స్థానిక బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఎ.శ్రీహరినాయుడు, ఎన్.రామకృష్ణ, పి.మురళీకృష్ణ, వి.గౌరీశ్వరరావులను మంగళవారం ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి వారు చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.విజయకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు శంభాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పాలకొండ రూరల్: సన్మాన గ్రహీతలతో సహచర ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: మండలంలోని పెద్దకాపువీధి ఎంపీపీ స్కూల్‌లో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు గోవిందరావు, వెంకటరావు, ఎం.సంపత్‌కుమార్, పద్మజలను హెచ్ఎం పార్వతీ, సహచర ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ప్రవేశాలు మెరుగుపడేందుకు, విద్యాభివృద్ధికి వారు అందించిన సహకారాన్ని కొనియాడారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సోమేశ్వరరావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, యామినీకుమార్, ఎం.వి.రమణ తదితరులున్నారు.

బదిలీపై వెళ్లిన సచివాల సిబ్బందికి సన్మానం

పాలకొండ: కొండాపురం గ్రామ సచివాలయంలో సేవలందించి ఇటీవల బదిలీపై వెళ్లిన సర్వేయర్ ఎల్.వెంకటరమణ, మహిళా పోలీసు మనశ్వినిని గ్రామస్తులు మంగళవారం ఘనంగా సన్మానించారు. వెంకటరమణకు లావేరు మండలానికి బదిలీ కాగా, మనశ్వినికి దేవాదాయశాఖలో ఈఓ ఉద్యోగం వచ్చింది. వారికి స్థానిక సర్పంచ్ రాయి వనజ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు శాసుబిల్లి జనార్దనరావు, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు సన్మానించారు.

ఐటీడీఏ పీఓ ఆకస్మిక తనిఖీ


జియ్యమ్మవలస: పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న పీఓ విష్ణుచరణ్

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలను ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. జగనన్న విద్యాకానుక కిట్లు అందరికీ అందాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రణాళికతో చదువుకోవాలని, ఉన్నత విద్య అభ్యసించి, ఉద్యోగాలు సాధించాలని వారికి సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి మెరుగైన బోధన అందించాలని ఉపాధ్యాయులతో అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని హెచ్ఎం తిరుపతినాయుడుకు సూచించారు.

బాలికల ఆశ్రమ పాఠశాల సందర్శన

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను గిరిజన సంక్షేమశాఖ డీడీ కె.శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు ఇచ్చిన జేవీకే కిట్లు పరిశీలించారు. యూడైస్ వర్క్, డ్రాపౌట్ల వివరాలను హెచ్ఎం లిల్లీరాణిని అడిగితెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. బాగా చదువుకుని మంచి మార్కులతో పాస్‌కావాలని, ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏటీడబ్ల్యూఓ మంగవేణి, హెచ్‌డబ్ల్యూఓ అమల తదితరులున్నారు.

పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరాకు చర్యలు

- టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్


ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

గరుగుబిల్లి: టిడ్కో గృహాలకు మంచినీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర సమీపంలో తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ వద్ద తాగునీటి సరఫరాకు ఉన్న అవకాశాలను పార్వతీపురం మున్సిపల్ సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం పట్టణం సమీపంలోని అడ్డాపుశీల వద్ద టిడ్కో ఆధ్వర్యంలో దాదాపు రూ.80 కోట్లతో 768 ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. నిర్మాణంలో ఉన్న జి+3 గృహ సముదాయాలకు 50 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం రూ.12 కోట్లు నిధులు కేటాయించినట్లు చెప్పారు. పార్వతీపురం పట్టణంలో ప్రతీరోజు తాగునీటి సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించాలని, నాలుగు నెలల్లో పనులు పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు టిడ్కో ఎస్ఈ డి.నర్సింహమూర్తి, పబ్లిక్ హెల్త్ ఈఈ దక్షిణామూర్తి, జ్యోతి, డీఈ బాలకృష్ణ తదితరులున్నారు.

నీచమైన విమర్శలు మానుకో పవన్

- ఎమ్మెల్యే కళావతి

భామిని: మహిళలను గౌరవించడం పవన్ కల్యాణ్ నేర్చుకోవాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని వడ్డంగిలో వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, బత్తిలి సొసైటీ చైర్మన్ బోదెపు రఘుపతినాయుడు, సర్పంచ్ కొండగొర్రి ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువచేస్తున్న వలంటీర్లను కించపరుస్తూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడటం సరికాదన్నారు. వలంటీర్లలో సగం మంది మహిళలే ఉన్నారని, మహిళల ఆగ్రహానికి గురైతే రాజకీయ సమాధి తప్పదని పవన్‌ను హెచ్చరించారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. పవన్ తన తీరుమార్చుకుని వలంటీర్లకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, భామిని సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, పార్టీ నాయకులు బొడ్డేపల్లి ప్రసాద్, మేడిబోయిన చలపతి, కొత్తూరు ప్రసాద్, కాగితాపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.